క్లుప్తంగా

దాబాలను పరిశీలించిన అధికారులు



పన్నూరు సబ్‌స్టేషన్‌లో దాబాకు తాళం వేసి మూసివేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: మండలంలోని మద్యం షాపు, దాబాలను ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి తన సిబ్బందితో తనిఖీ చేశారు. మంగళవారం పన్నూరు సబ్‌స్టేషన్ ఆవరణలో ఉన్న దాబాకు తాళం వేశారు. ఎక్కడైనా బెల్టు షాపులున్నాయా? అని ఆరా తీశారు. నిబంధన ప్రకారం మద్యం షాపులను తెరవాలని, బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సోమవారం సాక్షి దిన పత్రికలో 'బాల్యం మత్తుమయం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సీఐ స్పందించారు. మైనర్లకు మద్యం విక్రయిస్తే ఉపేక్షించేది లేదని మద్యం షాపులకు వార్నింగ్ ఇచ్చారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

కార్వేటినగరం : రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో తులసీరామ్ అనే దాత తన తండ్రి సుబ్బయ్య వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం అన్నదానం చేశారు. అలాగే వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తులసీరామ్ మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతికి ఏటా అన్నదానం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కంజెమ్మ, కృష్ణవేణి, మోహిత్‌కుమార్, లోకనాథం, సుబ్బలక్ష్మి, భార్గవి, పద్మజ, రామ్మోహన్‌రావు, వసుంధర, హేమమోహన, గుణశ్రీ, మోనీషా, దినేష్‌కాంత్ పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్

కార్వేటినగరం : స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ ఎం. విజయకుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధిలో ఉపాధ్యాయుల సహకారం మరువలేమన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ టీచర్ల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి యువరాజు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, నేతలు సర్దార్, ఆటుకారు చంద్రశేఖర్,బాబు, నాగేంద్రరాజు, అమర్‌నాథ్, దేవయ్య, గురవయ్య, కార్తీక్, జగదీశన్, వేణు, దాము, ఈశ్వరయ్య, సునీత, నాగజ్యోతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



అప్పలాయగుంటలో పూజాసామగ్రిని తీసుకు వస్తున్న టీటీడీ అధికారులు

వడమాలపేట (విజయపురం): ద్వాదశి ఉత్సవాల సందర్భంగా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంట ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయశుద్ధి చేసి, సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సూపరింటెండెంట్ శ్రీవాణి పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ బాలాజి టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నగరి: శుభాకాంక్షలు తెలిపే 2025 దోస




నూతనోత్సాహం

- జోరుగా కేక్‌లు, పుష్పగుచ్ఛాల అమ్మకాలు



పాలసముద్రం : శ్రీకావేరిరాజుపురంలో శ్రీకృష్ణుని ఆలయం



నగరి: నూతన ఆంగ్ల సంవత్సరం తలచుకోగానే ఒక ఉద్వేగం.. అంతులేని ఉత్సాహం.. రాత్రి 12 గంటలవగానే.. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకునేవారు. అయితే ఈ ఏడాది 30 పోలీస్ యాక్ట్ ఉండటంతో అర్ధరాత్రి సంబరాలు కనిపించలేదు. యువత జోష్ కొద్దిమేర తగ్గినట్లు కనిపించింది. బేకరీల్లో న్యూ ఇయర కేక్‌లు, పుష్పగుచ్ఛాల అమ్మకాలు జోరుగా సాగాయి. మరోవైపు, నూతన సంవత్సర వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణ పరిధిలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో భక్తులకు టీటీడీ క్యాలెండర్లు, డైరీలు అమ్మకానికి సిద్ధం చేశారు. రాజీవ్‌నగర్ గుట్టపై ఉన్న షిరిడిసాయి దివ్యధామంలో నూతన సంవత్సర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక హారతి పూజలు నిర్వహించనున్నారు. ఇక, మంగళవారం రాత్రి వివిధ చర్చిలలో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న 2025 దోస

నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ దేశమ్మ దేవాలయం సమీపంలోని హోటల్‌లో 2025 ఆకారంలో దోస వేశారు. దీనిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

కోర్టులో నూతన వేడుకలు

నగరి : స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను నిర్వహించారు. జడ్జి విష్ణువర్మ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు, చర్చిలు

పాలసముద్రం : మండలంలోని ఆలయాలు, చర్చిలను నూతన సంవత్సరం సందర్భంగా ముస్తాబు చేశారు. ఈ మేరకు విద్యుద్దీపాలతో విశేషంగా అలంకరించారు. ఆలయాల వద్ద తోరణాలు కట్టారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కార్వేటినగరం : శ్రీలక్ష్మీనరసింహ కళాశాలలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణను రంగవల్లులతో తీర్చిదిద్దారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దిలీప్‌కుమార్, ప్రిన్సిపల్ జమున, శరవణ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, భవాని, శ్రీను పాల్గొన్నారు.



నగరి : నూతన సంవత్సర కేక్‌ను కట్ చేస్తున్న జడ్జి విష్ణువర్మ



కార్వేటినగరం : కేక్ కట్ చేస్తున్న దిలీప్‌కుమార్

శుభాకాంక్షలు.. ఆశీస్సులు



పెద్దిరెడ్డికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న కృపాలక్ష్మి



మిథున్‌రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ..

గంగాధర నెల్లూరు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఈమేరకు పెద్దిరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు తీసుకున్నారు.

స.హ చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న చంద్రకళారెడ్డి

పుత్తూరు: సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలని సమాచార హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకళారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పుత్తూరులో సమాచార హక్కుల వేదిక ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని నీరుగారుస్తున్నాయని విమర్శించారు. సమాచార హక్కు గురించి ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో భాగవతారిణి నాగరత్నం, సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మునేంద్ర, సంఘ సభ్యులు చిన్న, రాజగోపాల్, దత్తాత్రేయ, లక్ష్మీపతి, రమేష్, కాశీంభాయ్, వెంకటరత్నం, అంకయ్య, హేమలత, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ నేత చెంగల్రాయనాయుడు(72) సోమవారం రాత్రి కన్నుమూశారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి మంగళవారం గ్రామానికి వెళ్లి చెంగల్రాయనాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, సర్పంచ్ ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

రైతులకు శిక్షణ

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని తులసీరాం అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూసార పరీక్షలతో ఆయా పొలాల్లో ఏ పోషకాల లోపం ఉందో తెలుసుకుని వాటిని అధిగమించేందుకు సరైన యాజమాన్య పద్ధతులను పాటించవచ్చన్నారు. ప్రకృతి, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించిన ట్రాన్స్‌కో ఎస్‌ఈ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కో ఓసీ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్లను మంగళవారం తన కార్యాలయంలో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ చేతుల మీదుగా యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిస్కం అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శేషాద్రిరెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు వివేకానందరెడ్డి, గజేంద్ర, హిమావంత్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజా సేవే మా లక్ష్యం



నారాయణస్వామి

వెదురుకుప్పం : ప్రజా సేవే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది జనం జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ బడ్జెట్ అమలుకు నోచుకుంటుందా?

- 2024–25 మున్సిపల్ బడ్జెట్ అంచనా రూ.70 కోట్లు



నగరి మున్సిపల్ కార్యాలయం

నగరి : 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో మున్సిపల్ అధికారులు ఈ ఏడాది రివైజ్డ్ బడ్జెట్‌ను రానున్న ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.70 కోట్ల అంచనాతో 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. గత ఏడాది బడ్జెట్ అంచనాలను అందుకోలేకపోయింది. గత బడ్జెట్‌లో రూ.46.57 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా అది సాకారం కాలేదు. ఇక మిగిలిన కాలం మూడు నెలలే కావడంతో రూ.42.04 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు సవరించారు. అలాగే గత ఏడాది ఖర్చులు రూ.55.5 కోట్లు అవుతుందని అంచనా వేసినా ఇప్పటి వరకు జరిగిన ఖర్చులు ఇకపై ఉన్న కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఖర్చులను రూ.42.01 కోట్లుగా సవరించారు. ఏడాదికి మున్సిపల్ ఆదాయం రూ.70 కోట్లు అంచనా వేస్తే ఖర్చులు రూ.59.12 కోట్లు అవుతుందని రూ.10.88 కోట్లు మిగులు ఉంటుందని చూపారు.

ఆదాయానికి దరిదాపుల్లోనే ఖర్చులు

మున్సిపాలిటీకి వచ్చే రెవెన్యూ ఆదాయం, అయ్యే ఖర్చులు దరిదాపుల్లోనే ఉన్నాయి. వివిధ పన్నులు, డ్యూటీలు, అద్దెలు, ఫీజులు, అపరాధ రుసుం, వడ్డీల రూపంలో వచ్చే ఆదాయం రూ.11.6 కోట్లు ఉంటే జీతాలు, విద్యుత్ చార్జీలు, టెలిఫోన్ బిల్లులు, అద్దెలు, స్టేషనరీ ఖర్చులు, ప్రాజెక్టుల తయారీకి, ప్రకటనలకు, వీధి దీపాలు, మురుగు కాలువల నిర్వహణ, వాటర్‌లైన్ల మరమ్మతులు, కార్యక్రమాల ఖర్చులు అంటూ రూ.10.64 కోట్లు అంచనా వేశారు. దీంతో సాధారణ నిధుల కింద రూ.1.56 కోట్లు మాత్రమే ఉంటుంది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో ఖర్చులు 9.39 కోట్లు అంచనా వేస్తే అది 9.99 కోట్లకు చేరింది. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరం కొనసాగితే మున్సిపాలిటీకి సాధారణ నిధులే ఉండవు. మరోవైపు పన్నుల వసూళ్ల కన్నా జీతాలే ఎక్కువగా ఉండటం గమనార్హం!

సస్యరక్షణ చర్యలు తీసుకోండి

నింద్ర: వరి, వేరుశనగ పంటలకు ఆశించే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం కోరారు. మంగళవారం మండలంలోని కర్చరవేడు, అగరం గ్రామాల్లో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు సస్యరక్షణకుగాను తప్పనిసరిగా పిచికారీ చేయాలన్నారు. వరిలో దోమపోటుకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గంగాధర నెల్లూరు : మండలంలోని వేపంజేరి పంచాయతీ చెన్నారెడ్డి ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, సర్పంచ్ వాసుదేవరెడ్డి పరిష్కరించారు. మంగళవారం ఈ మేరకు నూతన పైప్‌లైన్ వేయించి నీరు విడుదల చేశారు. ఈ క్రమంలోనే వేపంజేరి దళితవాడ, బాలగుర్రప్పకండ్రిగలో పర్యటించి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. స్థానిక నేత సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు



ఏర్పాటుచేసిన సీసీ కెమెరా వద్ద పోలీసులు

నగరి : మండలంలోని దామరపాకంలో పోలీసులు మంగళవారం దాతల సహకారంతో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు మరింత సహకారం అందిస్తే ప్రతి గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని సీఐ మహేశ్వర్ తెలిపారు.